క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వరరెడ్డి నగర్‌లో నిర్మించిన సీతారామాలయం ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కార్యక్రమానికి హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ ప్రశాంతి, మండల సచివాలయాల ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో డీవైఎఫ్ఐ శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు : బద్వేలులో మే 6, 7 తేదీల్లో డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. బుధవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నిరుద్యోగ సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను శిక్షణా తరగతుల్లో నిర్ణయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. డీఎస్సీ, గ్రూప్–2 నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, పట్టణాధ్యక్షుడు వెంకటేష్, సాగర్, నాగేంద్ర పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రోన్‌లు సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : వ్యవసాయంలో పెరుగుతున్న ఆధునికీకరణలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో డ్రోన్‌లను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండలంలోని పల్లవోలు రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. డ్రోన్‌ల ద్వారా క్రిమి సంహారక మందులను పంట పొలాలకు పిచికారి చేసుకోవచ్చన్నారు. రూ.10లక్షలు విలువ చేసే డ్రోన్‌లను ప్రభుత్వం రైతు సీహెచ్‌సీ గ్రూపులకు 40 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. ఏజీబీఎస్సీ డిప్లమో పూర్తి వారికి 50 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఏఓ కోరారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ఏఓ జగదీశ్వరరెడ్డి, హెచ్‌ఓడీలు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలో బుధవారం లలిత క్లాత్ మార్కెట్ యజమాని రవి సహకారంతో ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ కడపకు చెందిన వృద్ధుడికి వినికిడి యంత్రం అందచేశారు. ఆర్ఎంపీ వైద్యుడు రంగయ్య పేద వృద్ధునికి సహాయం చేయాలని కోరడంతో రూ.12 వేలు విలువ చేసే వినికిడి యంత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

బీపీఈడీ, డీపీఈడీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి బీపీఈడీ, డీపీఈడీ కోర్సులకు మే 10లోపు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, బీపీఈడీకి డిగ్రీ, డీపీఈడీకి ఇంటర్మీడియట్ చదివిన వారు అర్హులని తెలిపారు. మే 10 తర్వాత రూ.500తో అపరాధ రుసుంతో, మే 17 వరకు, రూ.1000 అపరాధ రుసుంతో మే 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ఫోన్ నంబర్ 9493904343 కు సంప్రదించాలని కోరారు.

వైఎంఆర్ కాలనీలో చైన్ స్నాచింగ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న శాస్త్రీనగర్‌లో బుధవారం సాయత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు సున్నపుబట్టి వీధికి చెందిన శ్రీవాణి తన టైలర్ షాపులో పని ముగించుకొని సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఇద్దరు వ్యక్తులు బైక్‌లో వచ్చి ఆమె మెడలోని బంగారు చైన్ లాక్కొని వెళ్లారు. చైన్ సుమారు 3 తులాలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి. గ్రామ సచివాలయాల్లో సంక్షేమ పథకాల కోసం వచ్చే వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అంజనేయకొట్టాలు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ తిరుగుతున్నప్పుడు అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారిని గుర్తించి వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామ పాలన తీసుకు వచ్చారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన :

అంజనేయకొట్టాలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. అక్కడ పిల్లలు ఎంత మంది ఉన్నారు? హాజరు సక్రమంగా ఉందా లేదా అని రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంపై ఆరాతీశారు. అంగన్‌వాడీ భవనం అద్దె గదిలో ఉండటంతో కొత్త భవనం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, అంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, పుల్లూరు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, చెమ్ముళ్ళపల్లె సర్పంచ్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

28న బద్రిపల్లెలో..

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో ఈ నెల 28న, విశ్వనాథపురం గ్రామంలో 29న గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణ వేణి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు.

ప్రజలతో మమేకమై సంక్షేమాన్ని వివరించండి

గృహసారథులకు ఎమ్మెల్సీ డీసీ దిశానిర్దేశం

బద్వేలు : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిత్యం ప్రజలతో మమేకమై వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి తెలియజేసి పార్టీ అనుకూలతను పెంచాలన్నారు. మనం మంచి చేస్తున్న ప్రజల దృష్టికి వెళ్లడం లేదన్నారు. దీనికి తోడు ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము చేసిన మేలు వారికి వివరించి నచ్చితేనే ఓటు వేయాలని కోరుతుండగా టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలతో లబ్ధి పొందాలనే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పార్టీ కన్వీనర్లు సి.బాషా, సుదర్శనం, గృహసారథుల సమన్వయకర్తలు గుండం హనుమంతరెడ్డి, రాజశేఖర్ రెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలి

బద్వేలు అర్బన్ : ఈ నెల 7 నుంచి ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించడం తోపాటు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాల పరిధిలోని జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి తలుపు తట్టాలని, సంక్షేమాన్ని వివరించాలని, సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి..

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి భూమిపూజ చేశారు.

కల్యాణం.. కమనీయం

రాజుపాళెం : మండలంలోని చిన్నజొన్నవరం గ్రామంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో వధువు శ్రీదేవి, భూదేవి వరుడు శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని చేయించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మహిళలు, ప్రజలు, యువకులు పాల్గొని విజయవంతం చేశారు. అక్కడకు వచ్చిన వారందరికి ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేసి గ్రామంలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో చేసిన కోలాటం ఆకట్టుకుంది.



కల్యాణ వెంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

'సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలి'

పోరుమామిళ్ల/ప్రొద్దుటూరు : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయా మండలాల సీఐటీయూ కార్యాలయాల్లో వారు నిరసన తెలుపుతూ విలేకరులతో మాట్లాడారు. ఈశ్వరయ్య కమలాపురంలో ఉండకుండా కడప పీడీ కార్యాలయంలో ఉంటూ అక్కడ దందాలు నడుపుతున్నాడని ఆరోపించారు. అంగన్‌వాడీ వర్కర్లను వేధిస్తూ, వారి దగ్గర లోపాయకారిగా లంచాలు తీసుకుంటున్నాడన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే ఈశ్వరయ్యపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, రత్నమయ్య, మేరీ, బీబీ పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో భైరవ ప్రసాద్ పాల్గొని మే1న నిర్వహించే ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

ధరలు అదుపు చేయడంలో కేంద్రం విఫలం

గోపవరం : బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నియంత పాలన సాగిస్తూ ధరలు అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మండలంలోని ప్రాజెక్టు కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారభేరి నిర్వహించారు. డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరల నియంత్రణలో కేంద్రం విఫలమైందని, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని తక్షణమే సాగనంపాలని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, మండల కార్యదర్శి పెంచలయ్య, కార్యవర్గ సభ్యులు రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల ఇక్కట్లు



ధాన్యం కాపాడుకునేందుకు కష్టపడుతున్న రైతు

చాపాడు : మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షంతో రైతులు ఇక్కట్లు పడ్డారు. మండల వ్యాప్తంగా ఇటీవల వరి, పసుపు పంటల నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8.50 గంటల నుంచి ఉన్నట్లుండీ ఈదురు గాలులతో కూడి అకాల వర్షం కురిసింది. గంట మేరకూ వర్షం పడటంతో పొలాల్లో ఉండే పంటలను కాపాడుకునేందుకు పసుపు, వరి ధాన్యపు రాశులపై పట్టలు కప్పుకుంటూ పంటను రక్షించుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇదే క్రమంలో పంట దశలో ఉన్న నువ్వు, కొర్ర, మినుము ఇంకా పలు రకాలైన పైర్లు ఈదురు గాలులకు పంట నేలకొరిగినట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



వాటర్‌బాయ్స్‌కు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా కూడా నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయా వార్డుల వాటర్‌బాయ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో బద్వేలు మున్సిపాలిటీకి మంజూరైన బృహత్తర తాగునీటి పథకం వలన పట్టణంలో ఎక్కడా నీటి సమస్య లేదని అయితే కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం వలన ఆయా వార్డుల్లో సకాలంలో నీరు పంపిణీ కావడం లేదన్నారు. సిబ్బంది అంకితభావంతో పని చేసి ఆయా వార్డులకు కేటాయించిన సమయానికి నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు దీప్తి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రముఖ వైద్యులు కాల్వ విజయ నాగేంద్ర, డాక్టర్ సమిత పేర్కొన్నారు. స్థానిక శ్రీ చక్ర పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు ప్రశాంతి, ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో రూ.10లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.20లక్షలు కేటాయించిందని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచించిన పనులు మంజూరయ్యాయన్నారు. అందులో భాగంగానే ఈ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గుమ్మళ్ల పద్మ, ఏఈ ఉమామహేశ్వరి, పట్టుపోగుల పుల్లయ్య, పార్వతి పాల్గొన్నారు.



భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఎం. నందిని



ఆక్విలిన్ ఫర్హత్



శ్రీలాస్య ప్రియ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు జూనియర్ కాలేజీల విద్యార్థులు బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. అభ్యాస్ జూనియర్ కాలేజి విద్యార్థులు ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎం.నందిని 1000 మార్కులకు 989, వాసవి, సాయితరుణ్ 987, హర్షిత 983, తనూజ 982, మాధురి, యశ్వంత్ 981 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు శ్రీలాస్య ప్రియ, హర్షిత 465, సుభాష్, వైష్ణవి 464, మహతి, అఫ్రిన్ 463, యోగేశ్వర్‌రెడ్డి 461, యశస్విని 460, బైపీసీలో 440 మార్కులకు హఫ్సా తబస్సుమ్, మొబిన్ 420 మార్కులు సాధించారు. స్థానిక షిర్డి సాయి జూనియర్ కాలేజి విద్యార్థులు ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో లక్ష్మీదివ్య 987, ధరణి 982, బైపీసీలో మంజులత 927, సీఈసీలో అర్షియ 915 మార్కులు సాధించారు. స్థానిక గీతం కళాశాల విద్యార్థులు బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440కి గాను ఆక్విలిన్ ఫర్హత్ 430, శ్రీవాణి 420, సీఈసీలో సుప్రత్ 477, ఎంపీసీలో బాబాబీ 458, నూరి హర్షియా, హారిణి 450 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో గురుమేఘన 1000కి 985, రెడ్డి సాయి మౌనిక 983, బైపీసీలో నాగవివేక 970, సీఈసీలో తస్లీం 946, తౌసర్ భాను 944 మార్కులు సాధించారు.

వృద్ధురాలి ఆచూకీ తెలపండి



వెంకటరమణమ్మ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలో సంచరిస్తున్న వృద్ధురాలు వెంకటరమణమ్మ ఆచూకీ తెలపాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. వారు బుధవారం సాక్షితో మాట్లాడుతూ తమ స్వగ్రామం కర్ణాటక రాష్ట్రంలోని భాగేపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న గుత్తపాలెం అని అన్నారు. కొద్ది రోజుల కిందట మతిస్థిమితం లేని ఆమె ఇంటి నుంచి వచ్చి ప్రొద్దుటూరు ప్రాంతంలో తిరుగుతున్నట్లు తెలిసిందన్నారు. వృద్ధురాలి ఆచూకి తెలిసిన వారు సెల్ నంబర్ 7022677754, 6303570143లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సామాజిక తనిఖీపై టీచర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ రవిశంకర్

చాపాడు : ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల సామాజిక తనిఖీపై స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల బుధవారం టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రవిశంకర్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను పేరెంట్స్ కమిటీ సమక్షంలో పరిశీలించి యాప్‌లో సమాచారం పొందుపరచాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులు అన్నింటిని నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సోషల్ ఆడిట్‌కు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై రీసోర్స్ పర్సన్ వెంకట సుబ్బయ్య ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మండల రీసోర్స్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక దాదాపీర్ స్వామి దర్గా



దాదాపీర్‌స్వామి

కాశినాయన : మండలంలోని చిన్నాయపల్లె గ్రామ సమీపాన సగిలేరు నది ఒడ్డున వెలసిన దాదాపీర్ స్వామి దర్గా హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. ఇక్కడ వెలసిన దాదాపీర్‌స్వామి భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతున్నారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తారు. ప్రతి ఏటా ఏప్రిల్‌లో జరిగే ఉరుసు మహోత్సవాలకు జిల్లా నుంచే కాక హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. సుమారు 500 సంవత్సరాల క్రితం స్వామి ఇక్కడ వెలిశారని, భక్తుల కోర్కెలను నెరవేర్చుతుండటంతో క్రమక్రమంగా భక్తులు పెరుగుతున్నారని ముజావర్ వలి తెలిపారు. ఈ నెల 27వ తేదీ గురువారం ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దర్గాను సందర్శించాలంటే పోరుమామిళ్ల నుంచి వంకమర్రి మీదుగా కోడిగుడ్లపాడు నుంచి వెళ్లవచ్చు. అలాగే వంకమర్రి నుంచి చిన్నాయపల్లె మీదుగా దర్గాకు మార్గం ఉంది.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి



రికార్డులను పరిశీలిస్తున్న పోస్టల్ అధికారి రాజేష్

బద్వేలు అర్బన్ : సుదీర్ఘ చరిత్ర కలిగిన తపాలా శాఖ మారుతున్న కాలానికి అనుగుణంగా అందిస్తున్న సేవలు, పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కార్యాలయంలోని కార్యకలాపాలను, ఆర్థికపరమైన రికార్డులను పరిశీలించడంతోపాటు సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే ఖాతాదారులతో నేరుగా మాట్లాడి పోస్టల్‌శాఖలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ అందిస్తున్న సుకన్య సమృద్ధియోజన పథకం, పోస్టల్ లైఫ్‌ఇన్స్యూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్‌ఇన్స్యూరెన్స్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ హుస్సేన్, సబ్ పోస్ట్‌మాస్టర్లు దానమ్మ, సుబ్బరాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన సమస్యలు సచివాలయాల్లోనే

రాజుపాళెం : ఆయా సమస్యల పరిష్కారం కోసం స్పందన ఫిర్యాదులను తమ గ్రామ పరిధిలోని గ్రామ సచివాలయాల్లోనే తెలియజేయాలని తహసీల్దార్ ఇందిరా రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఆయా గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండి స్పందన ఫిర్యాదులు స్వీకరిస్తారని, రెవెన్యూ, మండల పరిషత్, హౌసింగ్, పోలీస్ తదితర శాఖలకు సంబంధించిన అర్జీలను సచివాలయానికి వెళ్లి ఇవ్వొచ్చునని సూచించారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే డివిజన్ పరిధిలోని అధికారులకు, డివిజన్ పరిధిలో పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు ఇవ్వాలని తెలిపారు. ప్రజలందరూ ఇప్పటినుంచి ఈవిషయాన్ని గమనించాలని, తమ సమస్యలను సచివాలయాల్లో మాత్రమే ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని ఆమె చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ కాచన వెంకటసాయినాథరెడ్డి పాల్గొన్నారు.

వేధింపులు అధికమైతే తిరుగుబాటు తప్పదు

బద్వేలు అర్బన్ : పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం.విజయకుమార్ అన్నారు. ఉపాధ్యాయుల పట్ల పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండవ రోజు నిరసనలో భాగంగా బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి పాఠశాలలను సందర్శించడాన్ని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పక్షాన స్వాగతిస్తున్నామని, అయితే కేవలం ఉపాధ్యాయులను మాత్రమే టార్గెట్ చేస్తూ సస్పెన్షన్ల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ గణితవేత్త రామానుజన్

ఏఎఫ్‌యూ : ప్రపంచ గర్వించదగ్గ గణితవేత్త, మేధావి శ్రీనివాస రామానుజన్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీనివాస రామానుజన్ వర్ధంతి సందర్భంగా బుధవారం డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 20వ శతాబ్దంలో ప్రపంచఖ్యాతి పొందిన గణితమేధావుల్లో రామానుజన్ ఒకరన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, గణితశాస్త్ర అధ్యాపకులు ఇ.సి. సుప్రియ, సునీలరాణి, అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, వై. మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

స్వచ్ఛ సర్వేక్షన్ విజేతలకు అభినందన

కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ -22 పోటీల్లో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. తడిచెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ హటావో.. దేశ్‌బచావో.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై కళాశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి విజేతలుగా నిలిచారు. యూజీస్థాయిలో విశ్వవిద్యాలయ విద్యార్థులు విజేతలుగా నిలవడం పట్ల బుధవారం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యశాఖాధికారి చంద్రహాస్ రెడ్డి

దువ్వూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బద్వేలు డివిజన్ జిల్లా ఉప వైద్యశాఖాధికారి చంద్రహాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వైద్య సేవలను వంద శాతం ప్రజలకు అందించాలని వైద్య సిబ్బందికి అందించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంలో మెరుగైన పరీక్షలు నిర్వహించి మందులను అందించాలన్నారు. అనంతరం ఆయన ఆస్పత్రి రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.